
# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





# - 180 -
## విమాన కష్టాల్ వస్తాయ్, పోతాయ్ కథ – రెండవ భాగం

**గత సెప్టెంబర్,** 2022 లో న్యూజీలండ్ లో 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు కి భారత దేశం నుంచి మా గౌరవ ఆహ్వానితులు.. పడిన విమాన జొరా గారు...అనగా కవి జొన్నవితుల రామలింగేశ్వర రావు గారు, వోపా గారు..అనగా ప్రముఖ సాహితీవేత్త వోలేటి పార్వతీశం గారు...న్యూజీలాండ్ వీసా సమయానికి ఎలాగా రాదులే అనుకున్న నాకు, అనుకోకుండా వాళ్ళిద్దరికీ  సదస్సు రెండు రోజుల ముందు వీసాలు రావడం, ఆదరాబాదరాగా నేను రంగం లోకి దిగి ఆన్–లైన్ లోనే ఆ ఇద్దరికీ విమానం టికెట్లు కొనడం చకచకా జరిగిపోయాయి. అలాగే నాకూ, మా క్వీన్ విక్టోరియాకీ, సుపుత్రుడికీ, ఆప్త మిత్రుడు మల్లిక్ పుచ్చా కీ కూడా అమెరికా నుంచి విమానం టిక్కెట్లూ, న్యూజీలాండ్ లో అన్నీ చోట్లా అందరికీ హోటెల్ సదుపాయాలూ రిజర్వ్ చేసే సరికి నా క్రెడిట్ కార్డ్ భగ్గుమని మండడం మొదలు పెట్టింది. ఆ మంటలు చూసి నేను భోరు మంటుంటే ఆ వీసా వారు..అంటే ఈ వీసా వారు ఆ నూజీలాండ్ వీసా వారు కాదు..నా క్రెడిట్ కార్డ్ వీసా వారు మహదానంద పడ్డారు...అవును మరి...ఆ కార్డ్ మీద సుమారు 15 వేల డాలర్లు చార్జ్ చేశాను..అనగా అప్పు చేశాను కదా....అదనమాట ఈ వీసా వారి ఆనందానికి అసలు కారణం.

అయితే జొరా గారికీ. వోపా గారికీ ఒకే విమానంలో సీట్లు దొరక లేదు మరి. జొరా గారు సెప్టెంబర్ 15 సాయంత్రం 6 గంటలకి హైదారాబాద్ నుంచి స్థానిక ఇండిగో విమానంలో బెంగుళూరు వెళ్ళి,  అక్కడ ఎయిర్ న్యూజీలాండ్ వారి అంతర్జాతీయ విమానం లో సిడ్నీ ఆస్ట్రేలియా వెళ్ళి, కాస్సేపు ఆగి అక్కడ నుంచి న్యూజీలాండ్ లో ఆక్లండ్ వెళ్ళడానికీ, వోపా గారు అదే రాత్రి 12 గంటలకి హైదారాబాద్ నుంచి సింగపూర్ ఎయిర్ లైన్స్ లో సింగపూర్ వెళ్ళీ, అక్కడ విమానం మారి ఆక్లండ్ వెళ్ళడానికీ టికెట్లు దొరికాయి. వాళ్ళు అక్కడ హైదారాబాద్ లో విమానాలు ఎక్కాక మేము ఇక్కడ అమెరికాలో హ్యూస్టన్ నుంచి లాస్ ఏంజెలెస్ మీదుగా ఆక్లండ్ వెళ్ళాలి.  అన్నీ పకడ్బందీగా కుదిరాయి కదా. అదిగో అక్కడే విమాన కష్టాలు మొదలయ్యాయి.

జొరా గారి కష్టాలతో కథ ప్రారంభం... కవి గారు ఒక్క న్యూజీలాండ్ తప్ప ప్రపంచం లో ఇంచుమించు అన్నీ దేశాలూ తిరిగిన ఆయనకే ఈ చేదు అనుభవం ఇప్పటికీ ఆశ్చర్యం గానే ఉంది. ఆయన హైదారాబాద్ నుంచి బెంగుళూరు వెళ్ళి అక్కడ ఎయిర్ న్యూజీలాండ్ విమానం ఎక్కడానికి వెళ్ళగానే అక్కడ సూ బూటూ వేసుకున్న కుర్రాడు

"మీ ఆస్ట్రేలియా వీసా చూపించండి" అన్నాడు.

"నేను వెళ్ళేది. న్యూజీలాండ్ కదా. ఆ వీసా ఉంది. మధ్యలో ఈ దిక్కుమాలిన ఆస్ట్రేలియా వీసా ఎందుకూ? ఏమన్నా వేషాలు వేస్తున్నావా?" అన్నారు జొరా గారు.

"మీరు సిడ్నీ లో దిగుతారు కదా" అన్నాడు ఆ సూటు వాడు.

"ఇలా ఈ గేటులో దిగి, పక్క గేటులో ఎక్కడమే కదా. దానికి వీసా ఎందుకూ?" అడిగారు జొరా గారు.

"అవేమీ మాకు తెల్వద్ సార్. అక్కడ గేటు లో దిగాక మీరు మళ్ళీ సెక్యూరిటీ చెక్ లైన్ లోకి వెళ్ళి అప్పుడు రెండో గేట్ కి వెళ్తారు. అనగా ఆస్ట్రేలియా లో అడుగుపెడతారు. దానికి వీసా కావలెను అని స్పష్టంగా రాసి ఉంది. దాన్ని ట్రాన్సిట్ వీసా అందురు" ఆనాడు సూటు వాడు.

అలా అనేసి జొరా గారిని విమానం ఎక్కనియ్య లేదు. ఇలాంటిది కానీ వినీ ఎరగని జొరా గారు నాకు వెంఠనే ఫోన్ చేశారు. రాజా వారికి అది ఉదయం 6 గంటల సమయం కాబట్టీ, నాకున్న దురలవాటు ప్రకారం నిద్ర పోతున్నప్పుడు నా సెల్ ఫోన్ పక్కన పెట్టుకోను కాబట్టీ ఆయనకి నేను దొరక లేదు. వెంటనే ఆయన నా మిత్రులు మల్లిక్, శాయి రాచకొండలకీ కూడా ఫోన్ చెయ్యడంతో, వాళ్ళిద్దరూ మా సుపుత్రుడికి ఫోన్ చేసి, వాడిని నిద్ర లేపి, నన్ను నిద్ర లేపమని చెప్పడంతో వాడు నాకు టెంకి జెల్ల కొట్టి "ది హోల్ వరల్డ్ ఈజ్ కాలింగ్ యు. అండ్ దే ఆర్ బాదరింగ్ మి" అని నన్ను నిద్ర లేపాడు.

ఇలా లేచానో, లేదో.. ఫోన్ ఘాట్టిగా మోగింది... ఇంకెవరూ...జొరా గారే. ఎక్కడి నుంచీ బెంగుళూరు విమానాశ్రయం నుంచే. "ఇదిగో ఈ వెధవతో మాట్లాడండి" అని ఆ సూటు వెధవకి ఫోన్ ఇచ్చారు. నాకు విషయం అర్థం అయింది. జొరా గారు ఆ విమానం ఎక్కే అవకాశం లేదు. ఇప్పుడెలా? అప్పటికే జొరా గారు తన అసాధారణ అనుభవంతో, సమయ స్ఫూర్తితో ఆ రాత్రి 9 గంటల సమయం లో తన ట్రావెల్ ఏజెంట్ అమ్మాయి....ఆ సాయిబాబా భక్తురాలిని పిలిచి అప్పటికప్పుడు, అదే రాత్రి బెంగళూరు నుంచి మరేదైనా విమానం ఇలాంటి వెధవ ట్రాన్సిట్ వీసా అక్కర లేని దేశం మీదుగా న్యూజీలాండ్ వెళ్ళేవి విమానం ఏదైనా ఉందా అని క్షణాల మీద వెతకడం, మరొక ఆరు గంటల తర్వాత మలేషియా వారి విమానంలో ఒకే ఒక టికెట్ ఉంది అని తెలియగానే నాకు చెప్పడం జరిగిపోయింది. నేను ఫోన్ లో దొరకని ఆ గంట సమయం లో జొరా గారు సమస్య పరిష్కారం కోసం అటు న్యూజీలాండ్ లో శ్రీలత మగతల గారిని, ఇటు అమెరికాలో మల్లిక్, శాయి లనీ, మధ్యలో ఇండియాలో తన ట్రావెల్ ఏజెంట్ అమ్మాయి తోటీ శతావధానం చేశారు.

"ఖర్చు ఎంతయినా సరే. ముందు కొనేసి జొరా గారు బెంగుళూరు నుంచి తిన్నగా న్యూజీలాండ్ వెళ్ళేటట్టు చూడు. మళ్ళీ వెనక్కి హైదరాబాదో, మద్రాసు నుంచో పెట్టకు" అని గట్టిగా చెప్పి అర్ధరాత్రి సమయంలో ఆ ట్రావెల్ అమ్మాయి చేత జొరా గారికి మలేషియా విమానంలో టికెట్ ఏర్పాటు చేశాం.

"ఆ ఎయిర్ న్యూజీలాండ్ విమానం బయలుదేరడానికి ఇంకా గంట సమయం ఉంది కాబట్టి మీరు అర్జంటుగా జొరా గారి ఆ టికెట్ కేన్సిల్ చేస్తే కనీసం సగం డబ్బు అయినా వాపస్ వస్తుంది." అని ఆ సాయిబాబా భక్తురాలు ఓ సలహా విసిరి పారెయ్యడంతో "అవును కదా" అని నేను మళ్ళీ కంప్యూటర్ మీద లాగ్ ఇన్ అయి ఆ ఆన్ లైన్ ట్రావెల్ ఏజెంట్ ని తగులుకున్నాను. రాజా వారు తగులుకుంటే అలాగా ఇలాగా కాదు. "ఆ దిక్కుమాలిన ట్రాన్సిట్ వీసా గురించి నాకు ఎందుకు చెప్ప లేదూ...లేదూ...అసలు గేటు మార్చిడికి కూడా వీసా ఎందుకూ?" ఇలా ఆ ఆన్–లైన్ లో వాడిని చెడామడా తిట్టగానే వాడు బెంబేలు ఎత్తిపోయి, నేను బుక్ చేసిన హైదరాబాద్ నుంచి ఆక్లండ్ వెళ్ళే విమానం టికెట్ రద్దు చేసి 90 శాతం రిఫండ్ మళ్ళీ నా క్రెడిట్ కార్డ్ కి జమచేయించి కసి తీర్చుకున్నాను అనుకున్నాను. కావాలనే చేశాడో, లేదో తెలియదు కానీ కసి తీర్చుకున్నది ఆ ఆన్ లైన్ ట్రావెల్ ఏజెంట్ వాడే. పాపం అది అనుభవించినది ఏ పాపం ఎరగని వోపా గారు.

జొరా గారిని మలేశియా విమానం లో ఆక్లండ్ పంపించిన ఏర్పాట్లు చేసిన రాత్రే...వోపా గారు అర్ధరాత్రి 12 గంటలకి హైదరాబాద్ విమానాశ్రయానికి వెళ్ళి, అక్కడ నేను రిజర్వ్ చేసినట్టుగా సింగపూర్ ఎయిర్ లైన్ వారి విమానం కౌంటర్ దగ్గరకి చెక్ ఇన్ చెయ్యడానికి వెళ్లగానే అక్కడ ఉన్న సూటూ బూటూ గాడు వాడి కంప్యూటర్ లో చూసి నిర్ఘాంత పోయి "సర్. మీ టికెట్ కేన్సిల్ అయిపోయింది. మీకు విమానం లో సీటు లేదు" అన్నాడు. వోపా గారు అంత కన్నా ఎక్కువ గా నిర్ఘాంతపోయి, వాళ్ళిద్దరూ ఎన్ని సార్లు ఆ సింగపూర్ విమానం వాళ్ళ కంప్యూటర్ ని నొక్కీ, పీకీ, లాగి లెంపకాయ కొట్టీ తంటాలు పడినా అది ఈయన టికెట్ కేన్సిల్ అనే అరిచిగీపెట్టింది. పాపం వోపా గారు ఇంకా బయట లౌంజ్ లోనే ఉన్న ఆయన సతీమణిని అక్కడే ఉండమని చెప్పి, నాకు ఫోన్ చేశారు. అప్పుడే ఆన్ లైన్ ట్రావెల్ వాడిని చెడామడా తిట్టి జొరా గారి టికెట్ డబ్బు పూర్తి వాపస్ తెప్పించుకుని మహానందంగా ఉన్న నేను ఫోన్ ఎత్తి" వోపా గారూ...విమానం ఎక్కేశారా?" అని అడిగాను. అంతటి విపత్కర పరిస్థితిలోనూ పాపం ఆయన ఎంతో మర్యాదగా "ఎక్కుదామనే వచ్చాను. కానీ ఇక్కడ సింగపూర్ విమానం వాడు టికెట్ కేన్సిల్ అయింది, సీటు లేదు అంటున్నాడు. అసలు మీరు నిఝంగానే నాకు టికెట్ బుక్ చేశారా?"...ఇది వినగానే నా గుండె గుభేల్ మంది. వోపా గారిని లైన్ లో పెట్టి అప్పుడే మూసిన కంప్యూటర్ మళ్ళీ తెరిచి ఆ ఆన్–లైన్ వాడి నుంచి వచ్చిన కేన్సిలేషన్ మెసేజ్ చూద్దును కదా....అనుకోనిదంతా అయింది. నేను కొన్న రెండు టికెట్లూ హైదరాబాద్ నుంచి ఆక్లండ్ కాబట్టి, ఆ ఆన్–లైన్ వెధవ జొరాగారి టికెట్ బదులు వోపా గారిది కేన్సిల్ చేసి పారేశాడు.

మళ్ళీ ఫోన్ లో హడావుడి మొదలు. ఈసారి ఆన్ లైన్ లో ఫోన్ ఎత్తినది ఎక్కడో ఏ దేశం లోనో నిద్రపోతున్న ఆడమ్మాయి. సగం ఇంగ్లీషు. ఇంకో సగం కంగ్, చీంగ్, ఉంగ్...ఆ పిల్లకి జరిగిన కథంతా చెప్పి అప్పటికప్పుడు ఆ సింగపూర్ విమానం లో టికెట్ మళ్ళీ వోపా గారికి ఇచ్చితీరాలి అని నేను నానా గొడవా చేశాను. ఇక్కడ అమెరికా నుంచి ఫోన్ లో నేను విశ్వప్రయత్నం చేస్తూ ఉంటే అక్కడ హైదరాబాద్ లో ఆ విమానం బయలుదేరడానికి సిద్ధంగా ఉంది కాబట్టి ఈ టికెట్ కి ఎక్కడి కంప్యూటరూ ఒప్పుకోవడం లేదు...వోపా గారికి ఆ గేటు సూటు వాడు “అయ్యా...విమానం తలుపులు వేసేశారు. గేటు మూసేశాం.” “తాంబూలాలు ఇచ్చేశాం” అని చెప్పి వాడి సూటూ, బూటూ విప్పేసి మామూలు జీన్స్ లోకి మారిపోయాడు. అప్పటికి నేను ఆ ఆన్ లైన్ ట్రావెల్ అమ్మాయి తో ఫోన్ లో కుస్తీ పడి అదే టికెట్ మర్నాడు సరిగ్గా అదే సమయానికి అదే విమానం లో వోపా గారు వెళ్లడానికి ఏర్పాటు చేశాను.

ఆక్లండ్, న్యూజీలండ్ లో జరిగిన 8వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు లో పాల్గొన్న విదేశీ బృందం.
కవి జొన్నవిత్తుల గారు. విజయ మాధవి (సిడ్నీ), వంగూరి చిట్టెన్ రాజు, గిరిజ, అనుజ్, మల్లిక్ (అమెరికా), వోలేటి పార్వతీశం గారు.




పవిత్ర భారత దేశ ఆహ్వానిత అతిథుల విమాన కష్టాలు ఆ విధంగా ఎలాగో అలాగ అధిగమించి జొరా గారూ, వొపా గారూ హైదరాబాద్ నుంచి అనేక గంటల ప్రయాణం చేసి కొద్ది గంటల వ్యవధిలో ఒకే రోజున న్యూజీలండ్ చేరుకున్నారు. అక్కడ శ్రీలత మగతల గారు ఆప్యాయంగా విమానాశ్రయం లో స్వాగతం చెప్పి, నేను ఏర్పాటు చేసిన హొటెల్ కి తీసుకెళ్ళి మన పసందైన భోజనం పెట్టి పడిన కష్టాలని హుష్ కాకీ గా చేశారు. కానీ ఇక్కడ అమెరికాలో మా విమాన కష్టాలు మొదలు. మా విమాన కష్టాలతో పాటు న్యూజీలాండ్ విశేషాలు..మరొక సారి....

**COMMENTS**